క్లుప్తంగా

టూరిజం శాఖ చైర్మన్‌ను కలిసిన నాయకులు



శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానిస్తున్న దృశ్యం

పాల్వంచ: తెలంగాణ రాష్ట్ర టూరిజం శాఖ చైర్మన్‌గా నియమితులైన బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను పాల్వంచ పట్టణ బీఆర్‌ఎస్‌వీ అధ్యక్షుడు జూపెల్లి దుర్గాప్రసాద్ హైదరాబాద్‌లో సోమవారం మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించి సన్మానించారు. రాపోలు హరీశ్, రాపోలు అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం హామీలను అమలు చేయాలి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కార్మికులకు సీఎం కేసీఆర్ ఇచ్చిన సొంతింటి పథకం, అలియాస్ మారుపేర్లు, సింగరేణి కార్మికుల హైపవర్ వేతనాలు వంటి హామీలను వెంటనే అమలు చేయాలని, బీఎంఎస్ జాతీయ కార్యదర్శి, జేబీసీసీఐ సభ్యులు పి.మాధవనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెం ఏరియా పరిధిలోని ఆర్‌సీహెచ్‌పీలో ఏర్పాటు చేసిన గేట్‌మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. ప్రతి కార్మికుడికి 250 గజాల స్థలం ఇవ్వాలని, దేశంలో అతిపెద్ద సంస్థ అయిన కోలిండియా గతేడాది సాధించిన వార్షిక లాభాలు రూ.28 వేల కోట్లను ఆడిట్ ద్వారా ప్రకటించిందని, అదేవిధంగా సింగరేణి సంస్థ కూడా ఈ ఏడాది సాధించిన వాస్తవ లాభాలను ప్రకటించి 35శాతం వాటాను కార్మికులకు ఇవ్వాలని కోరారు. ఈనెల 19న 10వ సమావేశంలో వేజ్ అగ్రిమెంట్ పూర్తిచేయటానికి బీఎంఎస్ పెద్దన్న పాత్ర పోషిస్తుందన్నారు. రానున్న కాలంలో సింగరేణిని బతికించుకోవాలంటే బీఎంఎస్‌ను ఆదరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బీఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మొగిలిపాక రవి, టీఎస్ పవన్‌కుమార్, దాసరి శ్రీను, ఆనంద్, యాకూబుఉద్దీన్, కొలుగూరి శ్రీను, పూర్ణ, యశ్వంత్, చంద్రకాంత్, అస్లాం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి బీఎస్పీ పోరాటం



కరపత్రాలు అందజేస్తున్న కామేష్

చుంచుపల్లి: కొత్తగూడెం నియోజకవర్గంలో ఏ చిన్న సమస్య ఎదురైనా ప్రధాన ప్రతిపక్షంగా ప్రజా సమస్యలపై పోరాడేది ఒక్క బీఎస్పీ పార్టీ మాత్రమేనని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యెర్రా కామేష్ అన్నారు. సోమవారం చుంచుపల్లి మండలం చుంచుపల్లి తండాలో పాదయాత్ర నిర్వహించి, ప్రతిరోజూ వెయ్యి మందిని కలిసే కార్యక్రమంలో భాగంగా పలువురిని కలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం ప్రజల్లో ఉంటూ ప్రజా సమస్యలపై పోరాటం చేస్తూ వాటిని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేసే వారినే వచ్చే ఎన్నికల్లో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో మాలోత్ వీరు నాయక్, భూక్యా శంకర్, రవికుమార్, రూప్ సింగ్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా సీఎం కప్ క్రీడా పోటీలు

ఇల్లెందురూరల్: సీఎం కప్ క్రీడా పోటీలను మంగళ, బుధవారాలలో సమర్థవంతంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని ఎంపీడీఓ బాలరాజు, తహసీల్దార్ కృష్ణవేణి అన్నారు. ఇల్లెందులోని సింగరేణి ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోటీల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను సోమవారం వారు పరిశీలించారు. మాట్లాడుతూ.. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, పరుగుపందెం అంశాలలో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న క్రీడాకారులు తమ పేర్లను పీఈటీల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఈఓ పిల్లి శ్రీనివాస్, ఎంపీఓ చిరంజీవి పాల్గొన్నారు.

తొలిరోజు పోటీలకు స్పందన కరువు

సుజాతనగర్: రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు సీఎం కప్-2023 క్రీడా పోటీలకు శ్రీకారం చుట్టగా మొదటి రోజు సోమవారం స్పందన కరువైంది. మూడు రోజుల పాటు వివిధ క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించాల్సి ఉండగా.. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అధికారులు ఏర్పాట్లు చేశారు. మండల వ్యాప్తంగా తొలిరోజు అథ్లెటిక్స్ విభాగంలో రెండు టీములు, కబడ్డీ ఒక టీం, వాలీబాల్ ఒక టీం మాత్రమే ఎన్‌రోల్ చేసుకున్నారు. తీవ్రమైన ఎండల నేపథ్యంలో క్రీడల్లో పాల్గొనేందుకు క్రీడాకారులు రాలేదు. దీంతో క్రీడా పోటీలను మంగళవారం నిర్వహించనున్నామని అధికారులు తెలిపారు.

మున్సిపాలిటీలో దళారులు!

- అడ్డగోలుగా ఇంటి నంబర్ల కేటాయింపు
- వెరిఫికేషన్ చేయకుండానే పని పూర్తి
- మున్సిపల్ సిబ్బందిపై విమర్శలు



పాల్వంచలోని నవభారత్ ఏరియా వ్యూ

పాల్వంచ: మున్సిపాలిటీలో దళారులు రెచ్చిపోతున్నారు. ఖాళీ జాగా ఉన్నా, ఇంటి స్థలంలో యజమాని లేకున్నా వెంటనే అక్రమ రిజిస్ట్రేషన్ చేయించి, ఇంటి నంబర్లు తీసుకుని సెటిల్‌మెంట్లకు తెరలేపుతున్నారు. ఇలాంటి కేసులు ఇప్పుడు పట్టణంలో అధికంగా జరుగుతున్నాయి. నవభారత్ ఏరియాలో కొందరు ముఠాలుగా ఏర్పడి రెచ్చిపోతున్నారని బహిరంగ రహస్యం. గతంలో ఇలాంటి కబ్జారాయుళ్లకు కొంత వరకు తెరపడినా ఇటీవల కాలంలో మళ్లీ రెచ్చిపోతున్నారు. పట్టణంలోని నవభారత్ ఏరియాలో ఖాళీ స్థలం కనిపిస్తే చాలు.. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. ఇంటి నంబర్, కరెంట్ మీటర్, పంపు కనెక్షన్లు సృష్టించి అమ్మకానికి పెడుతున్నారు. స్థలాలు కబ్జాకు గురైన తర్వాత ఆయా యజమానులు ఎప్పటికో వచ్చి విషయం తెలుసుకుని పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయిస్తున్నారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాదనలు జరుగుతున్నాయి. పోలీస్ స్టేషన్ చుట్టూ తిరగడం ఎందుకని బేరాలు కుదుర్చుకుంటున్నారు. రోజువారీగా పోలీస్ స్టేషన్‌కు పలు కేసులు వస్తున్నాయి. దీంతో అసలు ఏవి, నకిలీ ఏవని పరిశీలించడం అధికారులకు తలకు మించిన భారంగా మారింది. ఈ వ్యవహారం వెనుక ఓ మున్సిపల్ కాంట్రాక్ట్ ఉద్యోగి సైతం కీలక పాత్ర వహిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

అడ్డగోలుగా ఇంటి నంబర్లు...

ఇదిలా ఉండగా మున్సిపాలిటీలో ఇంటి నంబర్ల కేటాయింపులపై పలు ఆరోపణలు ఉన్నాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వాటిని పరిశీలించకుండానే నంబర్లు కేటాయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. సెల్ఫ్ అసెస్‌మెంట్ కింద దరఖాస్తు చేసుకున్న వారు పక్కన ఉండే ఇంటి ముందు ఫొటో దిగి పంపిస్తుండగా, వాటినే పరిగణంలోకి తీసుకుని నంబర్లు ఇస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా నవభారత్ ఏరియాలో భూములకు సరైన రిజిస్ట్రేషన్లు, పత్రాలు లేవు. అక్కడి సర్వే నంబర్లలో భూములు అత్యధికంగా ప్రభుత్వ భూములే కావడం గమనార్హం. ఈ కోవలో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసే బిల్ కలెక్టర్లు దగ్గరుండి మరీ ఇంటి నంబర్లు ఇస్తూ చేతి వాటం ప్రదర్శిస్తున్నారని బాధితులు వాపోతున్నారు. సెల్ఫ్ అసెస్‌మెంట్ వచ్చిన తర్వాత గతంలో ఏదో కారణం చేత రద్దయిన వాటికి కూడా నంబర్లు ఇచ్చారు. గతంలో ఇలాంటివి జరగడంతో ఉద్యోగం నుంచి తొలగించినా పరిస్థితి మారడం లేదు. నిషేధిత భూమిలో కూడా ఇంటి నంబరు పొందుతున్నారు. సూపర్ స్ట్రక్చర్ పన్నుతో కూడా కొందరు నంబర్లు తీసుకుంటున్నారు.

వివాదస్పదంగా భూ సమస్యలు..

- పాత పాల్వంచలోని చింతలచెర్వు వద్ద ఆత్మలింగేశ్వరాలయం వద్ద భూఆక్రమణ విషయంపై ఆలయ కమిటీ నిర్వాహకులకు, కేటీపీఎస్ ఉద్యోగికి మధ్య వివాదాస్పదంగా మారింది.
- మంచికంటి నగర్ ఏరియాలో సర్వే నంబరు 444 భూమి మాదేనని కొందరు వాదిస్తుండగా, మరో వర్గం 409 పత్రాలు తీసుకొస్తున్నారు. ఈ విషయం కూడా తేలడం లేదు.
- పేట చెరువు వద్ద బీఆర్ఎస్ నాయకుడికి, గిరిజనులకు, గిరిజన సంఘ నేతకు మధ్య పోరాటం జరుగుతుంది. ఈ వ్యవహారంపై అధికారులు పలుమార్లు సర్వే చేశారు.
- శేఖరం బంజరలో రియల్‌ఎస్టేట్ వ్యాపారికి, స్థానికులకు మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ భూమి ఎక్కడుందో కూడా తేలడం లేదు.

ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



తప్పుడు నివేదికతో సెల్ఫ్ అసెస్‌మెంట్ కింద ఇంటి నంబర్లు పొందితే 25 రెట్లు జరిమానా విధించడం జరుగుతుంది. వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించిన తర్వాతే నంబర్లు కేటాయించడం జరుగుతుంది. ఎలాంటి సమస్య ఉన్నా ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం.

– సీహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, పాల్వంచ

భూదందాలపై చర్యలు తప్పవు



సివిల్ సమస్యల్లో అనవసరంగా తలదూర్చి అమాయకులను ఇబ్బంది పెట్టొద్దు. తప్పుడు పత్రాలు సృష్టించారని, భూ సమస్యలపై అనేక ఫిర్యాదులు వస్తున్నాయి. నిబంధనల మేరకు సమస్యను పరిష్కరించే విధంగా చూస్తున్నాం. భూ దందాలపై చర్యలు తప్పవు.

– నరేశ్, ఎస్ఐ, పాల్వంచ

బీజేపీ ఎంపీపై చర్యలు తీసుకోండి

సింగరేణి(కొత్తగూడెం): మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన నిందితుడు బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌ను వెంటనే అరెస్ట్ చేసి, శిక్షించాలని ఇఫ్టూ జిల్లా కమిటీ నాయకుడు కొక్కు సారంగపాణి డిమాండ్ చేశారు. సోమవారం కొత్తగూడెంలోని రైటర్‌బస్తీలో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో జిల్లా నాయకులు నెమిళ్ల సంజీవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో దుబాకుల ప్రసాద్, మోత్కూరి మల్లికార్జున్‌రావు, కందగట్ల సురేందర్, కరుణ, నాగలక్ష్మి, సంధ్య, కొంగ లక్ష్మి, నరసింహా, ప్రదీప్, వెంకటరత్నం పాల్గొన్నారు.

పాల్వంచ: బ్రిజ్ భూషణ్‌ని తక్షణమే అరెస్ట్ చేయాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు గౌని నాగేశ్వరరావు, ఏఐకేఎంఎస్ జిల్లా కోశాధికారి జక్కుల రాంబాబు అన్నారు. ఈ మేరకు సోమవారం మండలంలోని రెడ్డిగూడెం, ఉల్వనూరు గ్రామాల్లో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. అదేవిధంగా స్థానిక తహసీల్‌లో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. వీరమల్ల ఉమ, మల్లయ్య, వినోద్, వీరన్న, కళింటరెడ్డి, సోమ వినోద పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: మహిళా మల్లయోధులపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు తోడేటి నాగేశ్వరరావు, సారంగపాణి డిమాండ్ చేశారు. మండలంలోని రొంపేడు గ్రామంలో ఇఫ్టూ, ఏఐకేఎంఎస్, పీఓడబ్ల్యూ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. చిన్నస్వామి, వీరస్వామి, భద్రమ్మ, మల్లేశ్వరి, రాంబాబు, నాగమణి పాల్గొన్నారు.



పాల్వంచ: రెడ్డిగూడెంలో నిరసన తెలుపుతున్న ఐఎఫ్‌టీయూ నాయకులు, కార్యకర్తలు

టేకులపల్లి: ఢిల్లీలో మహిళా రెజ్లర్లు చేస్తున్న న్యాయ పోరాటానికి న్యూడెమోక్రసీ ఐఎఫ్‌టీయూ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు యూనియన్ జిల్లా నాయకుడు డి.ప్రసాద్ న్యూడెమోక్రసీ మండల కార్యదర్శి కల్తి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు సోమవారం జాతీయ కమిటీ పిలుపులో భాగంగా టేకులపల్లి సింగరేణి కాలనీలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడారు. నాగమణి, జ్యోతి, రమణ, శారద, యర్రమ్మ, గణేష్, శివయ్య పాల్గొన్నారు.

నేడు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ

టేకులపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 10 గంటలకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ ఉంటుందని తహసీల్దార్ లంకపల్లి వీరభద్రం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇల్లెందు ఎమ్మెల్యే బాణోతు హరిప్రియ చేతుల మీదుగా లబ్ధిదారులకు చెక్కులు అందజేయడం జరుగుతుందని లబ్ధిదారులు సకాలంలో హాజరు కావాలని కోరారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్న కారణంగా లబ్ధిదారులు తగిన రక్షణ చర్యలు, తగిన జాగ్రత్తలు పాటిస్తూ రావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు మెగా వైద్యశిబిరం

టేకులపల్లి: మారుమూల పేద గిరిజనులకు వైద్యం అందించాలన్న కలెక్టర్, ఐటీడీఏ పీఓల ఆదేశాల మేరకు టేకులపల్లి మండలంలోని బోడు ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు మండల వైద్యాధికారి కందుల దినేష్ తెలిపారు. నిపుణులైన వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు. ఉదయం పది గంటలకు మొదలయ్యే ఈ శిబిరాన్ని బోడు, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే చంద్రావతి పర్యటన

జూలూరుపాడు: పాపకొల్లు, కొత్తూరు, రాజారావుపేట, మాచినేనిపేట తదితర గ్రామాల్లో మాజీ ఎమ్మెల్యే బానోత్ చంద్రావతి సోమవారం విస్తృతంగా పర్యటించారు. శుభకార్యాలకు హాజరయ్యారు. అదేవిధంగా అనారోగ్యం, ప్రమాదానికి గురై వద్ద చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. అంతే కాకుండా మృతులకు నివాళి అర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేందర్, డోకుపర్తి సుబ్బారావు, మందడపు శంకర్ రావు, వేల్పుల నరసింహారావు, కన్నెగంటి హుస్సేన్, బానోత్ చిన్నా, వీరన్న పాల్గొన్నారు.

జేకే ఓసీని వ్యతిరేకిద్దాం..

ఇల్లెందురూరల్: జేకే ఓసీ పేరుతో పూసపల్లి గ్రామం చుట్టూ సింగరేణి యాజమాన్యం ఏర్పాటు చేయనున్న ఓసీని వ్యతిరేకిస్తూ భూగర్భగనుల కోసం ఉద్యమిద్దామని న్యూడెమోక్రసీ నార్త్ ఈస్ట్ తెలంగాణ రీజినల్ నాయకుడు యాకయ్య పిలుపునిచ్చారు. కొమ్ముగూడెం గ్రామంలో వెంపల్లి వెంకటేశ్వర్లు అధ్యక్షతన సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఓసీల వల్ల ప్రజలకు ఎక్కువగా నష్టాలు ఉంటాయని చెప్పారు. పర్యావరణ సమస్యలు ఉత్పన్నమవుతాయన్నారు. వందేళ్ల చరిత్ర కలిగిన సింగరేణి పుట్టినింటిని బొందల గడ్డగా మార్చే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ఆవిర్భావం నుంచి బొగ్గు తరలించిన సింగరేణి యాజమాన్యం ఈ ప్రాంతంలో చెప్పుకోదగ్గ తీపిగుర్తును ఒక్కటీ ఏర్పాటు చేయలేదన్నారు. ఈ ప్రాంతంలో కొత్త గనులు ప్రారంభిస్తే అవి భూగర్భ గనులు మాత్రమే చేపట్టాలని, లేనిపక్షంలో ప్రజాఉద్యమాలు నిర్మించి సింగరేణి చర్యలను ప్రతిఘటిస్తామన్నారు. చిన్నస్వామి, ధనుంజయ్, సురేష్, కొండ్రు లక్ష్మీనారాయణ, ఎనగంటి నరేష్, చుక్కమ్మ, కోటమ్మ, సుశీల పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల సమ్మె



టేకులపల్లి: సమ్మె చేస్తున్న వీఓఏలు

టేకులపల్లి: వీఓఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని తదితర డిమాండ్లతో సీఐటీయూ ఆధ్వర్యంలో వీఓఏలు నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె కొనసాగుతోంది. ఈ మేరకు సోమవారం సెర్ప్ కార్యాలయం వద్ద 29వ రోజు సమ్మె నిర్వహించారు. పలు డిమాండ్లతో కూడిన నినాదాలు చేశారు. కార్యక్రమంలో జయ, భాగ్యలక్ష్మి, ఉపేంద్ర, అరుణ, రాజు, మంగీలాల్, రాధ, స్వరూప పాల్గొన్నారు.

ఇల్లెందురూరల్: తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ వీఓఏలు చేపట్టిన నిరవధిక సమ్మె 29వ రోజుకు చేరుకుంది. సోమవారం సెర్ప్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. సంఘం నాయకులు మాట్లాడుతూ.. తమ సమస్యలపై ఇప్పటికే మండల స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి ప్రజాప్రతినిధులకు, అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామన్నారు. అయినా ప్రజాప్రతినిధులు తమ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లకుండా ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కొందరు ప్రజాప్రతినిధులు తమ ఉద్యమం పట్ల అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో నబీ, నవ్య, ప్రమీల, పాపారావు, మోతీలాల్, వసంతరావు, సురేష్, రమేష్, ప్రతాప్, సుల్తానా, లీలావతి, రమ, వెంకటలక్ష్మి, వసంత తదితరులు పాల్గొన్నారు.

యువతీ, యువకులు క్రీడల్లో రాణించాలి



టేకులపల్లి: పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ భూక్యా రాధ, అధికారులు



జూలూరుపాడు: క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ లావుడ్యా సోనీ

టేకులపల్లి: క్రీడల్లో యువతీ, యువకులు రాణించి జిల్లా, రాష్ట్ర స్థాయిలో పేరు తీసుకురావాలని టేకులపల్లి ఎంపీపీ భూక్యా రాధ, ఎంపీడీఓ కోట వీరబాబు, తహసీల్దార్ లంకపల్లి వీరభద్రం అన్నారు. ఈ మేరకు సీఎం కప్ 2023 క్రీడా పోటీలు సోమవారం టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ ఠాకూర్ రాంసింగ్, ఎంపీఓ గణేష్ గాంధీ, జయకృష్ణ, ఎల్.కిరణ్, భూక్యా సైదులు, కస్నా, వి.నరేష్, అంజయ్య, ఉషాకిరణ్, మంగాదేవి పాల్గొన్నారు.

జూలూరుపాడు: సీఎం కప్ మండల స్థాయి క్రీడా పోటీలు సోమవారం జూలూరుపాడు హైస్కూల్‌లో వైస్ ఎంపీపీ గాదె నిర్మలతో కలిసి ఎంపీపీ లావుడ్యా సోనీ ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ శారద, మండల పరిషత్ సూపరింటెండెంట్ తాళ్లూరి రవి, ఎంఈఓ గుగులోత్ వెంకట్, ఎంపీఓ కృష్ణ, జూలూరుపాడు సర్పంచ్ గుండెపిన్ని విజయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ముత్యాలమ్మ తల్లి జాతర



భక్తులతో కలిసి నృత్యం చేస్తున్న కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు

కొత్తగూడెంటౌన్: పట్టణ పరిధి మున్సిపాలిటీ 11వ వార్డులోని చిట్టి రామవరంలో సోమవారం ముత్యాలమ్మతల్లి జాతర పండుగను స్థానికులు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. భక్తులు అమ్మవారికి నైవేద్యం సమర్పించి, మొక్కులు అప్పజెప్పి అమ్మవారి దీవెనలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మహిళా భక్తులు బోనాలతో డప్పు వాయిద్యాల మధ్య నృత్యాలుచేస్తూ ఆలయానికి చేరుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. జాతరకు పలువురు రాజకీయ నాయకులు హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరావు హాజరై ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులతో కలిసి స్టెప్పులేసి ఆడిపాడారు. ఎమ్మెల్యే వనమా మాట్లాడుతూ.. ముత్యాలమ్మ తల్లి ప్రజలందరినీ చల్లగా చూడాలని, అందరి జీవితాల్లో సుఖసంతోషాలు నింపాలని ఆకాంక్షించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కాపు సీతాలక్ష్మి, చిట్టి రామవరం వార్డు కౌన్సిలర్ భూక్యా శ్రీనివాస్, లచ్చిరాం, బానోతు శ్రీను, రాజుగౌడ్ హాజరై అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు.

జీవన విధానంలో మార్పులు రావాలి



మాట్లాడుతున్న జీఎం రమేష్

సింగరేణి(కొత్తగూడెం): పర్యావరణ పరిరక్షణకై ప్రతిఒక్కరూ తమ జీవన విధానాన్ని మార్చుకోవాలని కొత్తగూడెం ఏరియా జనరల్ మేనేజర్ జక్కం రమేష్ అన్నారు. సోమవారం కొత్తగూడెం ఏరియా జీఎం కార్యాలయ ఆవరణలో పర్యావరణ రహిత జీవన శైలిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ.. సింగరేణి ప్రాంతాల్లో ఒకప్పటికీ నేటికీ చాలా మార్పులు వచ్చాయని, పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించేందుకు మన నిత్యజీవితంలో అలవాట్లను మార్చుకోవాలన్నారు. ఇంటి నుంచి బయటకు వెళ్లేటప్పుడు విద్యుత్ పరికరాలను ఆఫ్ చేయడం, ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద గ్రీన్‌లైట్ వచ్చే వరకు మన వాహనాల ఇంజిన్ ఆఫ్ చేయడం, మనం తినే కూరగాయలకు ఎరువులు, మందులు వేయకుండా మన పెరట్లోనే పండించుకోవాలని, పాడైన వస్తువులను పడేయకుండా తిరిగి రిపేరు చేయించుకోవడం, మనం ఎక్కడికి వెళ్లినా వెంట వాటర్‌బాటిల్‌ను తీసుకెళ్లడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో టీబీజీకేఎస్ ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, ఏరియా ఎస్ఓటూ జీఎం జీవీ కోటిరెడ్డి, డీజీఎం పర్సనల్ సామ్యుల్ సుధాకర్, టి.సత్య నారాయణ, కిరణ్‌బాబు, సుధాకర్, వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కుల సాధనకు పోరాటం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

పాల్వంచ: అడవికే మూలమైన ఆదివాసీలు తమ అస్థిత్వ రక్షణ, హక్కుల కోసం పోరాడాలని గుండాల ఎంపీపీ ముక్తి సత్యం అన్నారు. సోమవారం స్థానిక తహసీల్ రోడ్డులో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో.. ఈనెల 21న విశాఖపట్నంలో జరగనున్న అఖిల భారత ఆదివాసీల సదస్సు కరపత్రాలను ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. బీజేపీ ప్రభుత్వం నూతన అటవీ సంరక్షణ నియమాల పేరుతో కొత్త చట్టాలను తీసుకొచ్చి ఆదివాసీలను అడవుల నుంచి పంపే కుట్ర చేస్తోందన్నారు. కార్పొరేట్, పెట్టుబడిదారులకు అడవులను ధారాదత్తం చేసేందుకు పాలకవర్గాలు పూనుకున్నాయన్నారు. ఇప్పటికే అనేక రాష్ట్రాల్లో ఆదివాసీలను వలసదారులుగా చిత్రీకరిస్తూ మా రాష్ట్రాల నుంచి వెళ్లి పోవాలంటూ ఒత్తిడి చేస్తున్నాయని విమర్శించారు. ఆదివాసీల ఐక్యత కోసం 21న విశాఖపట్నంలో జరిగే అఖిల భారత ఆదివాసీ సదస్సుకు ఆదివాసీలు అధిక సంఖ్యలో హాజరై విజయవతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గుండాల జెడ్పీటీసీ ఈసం రాములమ్మ, సర్పంచ్ కోరం సీతారాములు, ఆదివాసీ నాయకులు జక్కుల రాంబాబు, ఈసం కృష్ణ, వీరన్న, ఇరుగు వినోద్ తదితరులు పాల్గొన్నారు.

అధికారులపై దాడి దుర్మార్గం



జీఎంకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

ఇల్లెందు: సింగరేణి అధికారుల మీద దాడులకు పాల్పడిన వారు ఎంతటి వారైనా శిక్షించాలని, అలాంటి వారిని ఉపేక్షించరాదని, తక్షణమే తగు చర్యలు తీసుకుని బాధితులకు అండగా నిలవాలని సింగరేణి బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సోమవారం అసోసియేషన్ నేతలు ఏరియా జీఎం ఎం.షాలేమురాజును తన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. ఆదివారం జేకే ఓసీ యాక్టింగ్ మేనేజర్ శివప్రసాద్ మీద బీఆర్ఎస్ ఇల్లెందు పట్టణ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరెడ్డి దాడి చేసి భయభ్రాంతులకు గురి చేశాడని తెలిపారు. కార్యక్రమంలో సింగరేణి బీసీ వెల్ఫేర్ అసోసియేషన్ ఫౌండర్ సభ్యులు పంజాల శ్రీనివాసు, సింగరేణి బీసీ అసోసియేషన్ అధ్యక్షులు పి.పూర్ణచందర్, ఉపాధ్యక్షుడు బండారి కోట సాంబయ్య, ఎస్వీ ఎస్ఎన్ రాజు, సేఫ్టీ ఆఫీసర్ శివప్రసాద్, డీజీఎం పర్సనల్ జీవీ మోహన్‌రావు, పర్సనల్ మేనేజర్ కృష్ణ, వర్క్‌షాప్ ఇంజనీర్ పవన్ పాల్గొన్నారు.

ఘనంగా సువార్త ఉజ్జీవ సభ



బిషప్ పద్మారావుకు మెమెంటో అందజేస్తున్న మడత రమ, వెంకట్‌గౌడ్

ఇల్లెందు: సీఎస్ఐ చర్చి ఆధ్వర్యంలో పట్టణంలోని మిషన్ స్కూల్ గ్రౌండ్‌లో సోమవారం సువార్త ఉజ్జీవ సభ ఘనంగా జరిగింది. బిషప్ పద్మారావు ప్రసంగించారు. ఈ సభకు ఇల్లెందు మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ హాజరయ్యారు. మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా క్రైస్తవ పండుగలలో, కష్టసుఖాల్లో పాలు పంచుకున్నట్లు చెప్పారు. పట్టణం నడిబొడ్డున మిషన్ స్కూల్ గ్రౌండ్‌లో ఏటా దసరా జమ్మి ఉత్సవాలు జరిగేవని, కానీ ప్రస్తుతం ఉత్సవాలకు అవకాశం లేకుండా చేశారని దీంతో క్రైస్తవులతో కలిసి మెలిసి ఉండే హిందువులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో అనుమతి ఇవ్వాలని బిషప్‌కు విన్నవించారు. అనంతరం మడత రమా వెంకట్‌గౌడ్‌లను అభినందించారు. అనంతరం ఉజ్జీవ సభలకు రూ.25 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో ఫ్రాంక్లిన్, ఆగస్టీన్ ప్రేమ్‌రాజ్, టి.యేసురత్నం పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఇల్లెందు: పట్టణంలోని కొత్త కాలనీకి చెందిన జీవన్ పాసీ రోడ్డు మీద వెళ్తుంగా ఓ బొగ్గు లారీ నుంచి బొగ్గు పెళ్ల మీద పడి తలకు తీవ్రంగా గాయాలయ్యాయి. మహబూబాబాద్‌లో వైద్యం పొందుతున్న జీవన్ పాసీని సోమవారం కొత్త కాలనీకి చెందిన శివశక్తి దండు సారయ్య(సారిక) పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సాయం అందజేశారు. సారయ్య వెంట మేకల నాగేశ్వరరావు, బొల్లిరాజు, జాన్సన్, వెంకటేష్, చంటి, సోనూ, రంజిత్ ఉన్నారు.



అటెన్షన్ ప్లీజ్

పొంచి ఉన్న ప్రమాదం..



తహసీల్‌లో కార్యాలయ నేమ్ బోర్డు వెనక్కు ఒరిగింది. అంతేకాకుండా బోర్డు తుప్పు పట్టి వంగిపోయి ప్రమాదకరంగా ఉంది. నిత్యం మండల ప్రజలు వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వచ్చిపోతుంటారు. ఆ బోర్డు మీద పడే ప్రమాదం పొంచి ఉంది. ఏ ప్రమాదం జరగక ముందే బోర్డును తొలగించాలని పలువురు మండల ప్రజలు కోరుతున్నారు.

– సుజాతనగర్

ప్రశ్నించాల్సిన అధికారి : కాంతారావు, ఆర్ఐ
సెల్ నెంబర్: 9177642019